సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 26 । జనవరి । 2025



దేశ రక్షణలో.. మేముసైతం
ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల యువత భారీగా సైన్యంలో చేరి సేవలందిస్తున్నారు.
వివరాలు 8లో ▶

ఘనతంత్రం

'కుల, మత, లింగ వివక్ష లేకుండా స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం అమలు జరిగితే దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో సమన్యాయం దక్కుతుంది.' అని చెబుతున్న మన రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని అందివచ్చిన హక్కులు, అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ పలువురు అనేక రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారు. వినూత్న పద్ధతిలో పంటలు సాగు చేస్తున్న రైతులు.. సొంతకాళ్లపై నిలబడి మరికొందరికి ఉపాధి కల్పిస్తున్న మహిళలు.. దేశసేవలో మేము సైతం అంటూ యువకులు.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో రంగంలో రాణిస్తూ.. తమకంటూ ప్రత్యేకతను చాటుతూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఆదివారంతో రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 వసంతాలు పూర్తవుతోంది. ఈ క్రమంలో వివిధ రంగాల్లో రాణిస్తూ దేశసేవలో నిమగ్నమవుతున్న పలువురిపై ప్రత్యేక కథనం.

– సాక్షి, నాగర్‌కర్నూల్

- గణతంత్ర స్ఫూర్తిని చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్న పలువురు
- సేంద్రియ పద్ధతిలో ప్రకృతి హితంగా సాగుతున్న రైతులు
- మహిళాశక్తి క్యాంటీన్లతో రాణిస్తున్న మహిళా సంఘాల సభ్యులు
- యువతలో చైతన్యం నింపుతున్న మాజీ సైనికుడు
- నేటితో రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తి



సేంద్రియ సాగులో కర్షక దంపతులు..

లాభాలు, నష్టాల తలంపు లేకుండా ప్రకృతినే నమ్ముకుంటూ రసాయనిక ఎరువులు వాడకుండా 24 ఏళ్లుగా సేంద్రియ సాగులో నిమగ్నమవుతున్నారు ఓ రైతు దంపతులు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం కార్వంగ గ్రామానికి చెందిన కొసిరెడ్డి లావణ్య, రమణారెడ్డి దంపతులు 24 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. రసాయనిక మందులు వాడకుండా, నేలకు, నీటికి, ప్రకృతికి నష్టం చేయకుండా సేంద్రియ ఎరువులతోనే పంటలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సన్నరకం, బాస్మతి తదితర వరి వంగడాలతోపాటు మిర్చి, పసుపు, జొన్నలు వంటి పంటలు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్నారు. ప్రధానంగా మిర్చి పంటకు చీడపీడల తాకిడి ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా రైతులు మిర్చి పంటకు వారం, పదిరోజులకు ఒకసారి రసాయనిక ఎరువులతో పంటలను కాపాడుకుంటారు. కానీ, వీరు మాత్రం రసాయనిక ఎరువులు వాడకుండా, కేవలం సేంద్రియ ఎరువులతో మిర్చి పంట పండిస్తున్నారు. ప్రకృతి ప్రసాదించిన విషముష్టికాయలతో కషాయం, ఆవు మూత్రం, పేడలతో ఎరువులు తయారు చేసి పంటలను కాపాడుకుంటున్నారు.



నా చిన్నతనంలో జెండా పండుగ లేదు..

నా భర్త అంబటి చంద్రశేఖర్ దేశ స్వాతంత్ర్యం కోసం కొట్లాడారు. నా చిన్నతనంలో జెండా పండుగలు, జెండా ఎగురవేయడం చేయలేదు. అప్పటి నిజాం సర్కారు పాలనలో హక్కులు, సమానత్వం లేదు. అన్నింటికీ ఆంక్షలే ఉండేవి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి రాజ్యాంగం వచ్చాక అన్నింటా ఆడ, మగ సమానత్వం లభించింది. అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, ఓటుహక్కు వచ్చాయి. రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే మహిళలు రాజకీయంగా రాణించేందుకు అవకాశం దక్కింది. అందరికీ విద్య అందుబాటులోకి వచ్చింది. అక్షరాస్యత శాతం పెరిగింది.

– అంబటి లీలావతి, నాగర్‌కర్నూల్

సేంద్రియ సాగుపై పట్టు



సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన వరిపంటలో రైతు లక్ష్మణశర్మ (ఫైల్)

జడ్చర్ల టౌన్: పర్యావరణ హితంతో పాటు ఆరోగ్యాలను కాపాడే విధంగా సేంద్రియ వ్యవసాయం చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు మిడ్జిల్ మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన తెలకపల్లి లక్ష్మణ శర్మ కుటుంబం. దశాబ్దకాలంగా పూర్తిగా పురుగు మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేస్తున్నారు. వారికి ఉన్న 10 ఎకరాలతో పాటు బంధువులకు చెందిన 30 ఎకరాలు సైతం కౌలుకు తీసుకుని మొత్తం 40 ఎకరాలు ఇదే పద్ధతిలో సాగు చేస్తున్నారు. ప్రతి ఏటా 15 ఎకరాల్లో వరిపంట సాగుచేస్తుండగా.. మిగిలిన భూమిలో కూరగాయలు, మిర్చి సాగు చేస్తున్నారు. సుభాష్ పాలేకర్ స్ఫూర్తిగా వారు సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపారు. సొంతంగా పంటలకు అవసరమైన వర్మీ కంపోస్టుతో పాటు జీవామృతం, గణ జీవామృతం తయారు చేసుకుంటున్నారు. పండిన పంటలను మహబూబ్‌నగర్‌లోని కొన్ని సూపర్ మార్కెట్లు, హోటళ్లకు సరఫరా చేస్తున్నారు. సాధారణ వ్యవసాయంలో ఎకరాకు 40 బస్తాల వరకు దిగుబడి రాగా సేంద్రియ పద్ధతిలో 25–30 బస్తాల దిగుబడి వస్తుంది. అలాగే ఈ పద్ధతికి శ్రమ కూడా అధికమే. కానీ, ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొనే ఎన్ని కష్టాలు ఎదురైనా సేంద్రియ పద్ధతిలోనే ముందుకు సాగుతున్నారు. లక్ష్మణశర్మ కుమారుడు సాకేత్‌రాం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి ఆరేళ్లుగా తండ్రితో కలిసి సహజ వ్యవసాయం చేస్తున్నాడు. ప్రస్తుతం ఆర్గానిక్ వ్యవసాయంలో లక్ష్మణశర్మ భార్య జానకమ్మ, కుమారుడు సాకేత్‌రామ్, కోడలు శ్వేతలు పూర్తిగా నిమగ్నమయ్యారు. దీంతో పాటు గానుగ నూనెలు తయారు చేస్తున్నారు.

మహిళామణులు

- ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుంటున్న అతివలు
- అధునాతన హంగులతో మహిళాశక్తి క్యాంటీన్స్ ఏర్పాటు
- రోజుకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకు సంపాదన

వారంతా స్వయం సహాయక మహిళా సంఘాల్లోని సభ్యులు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకున్నారు. ప్రభుత్వం బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకున్నారు. సొంతంగా వ్యాపారం చేసుకోవాలనే వారి ఆకాంక్షకు ప్రభుత్వం అండగా నిలిచింది. వారి ఆసక్తి మేరకు మహిళాశక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేయించింది. ప్రభుత్వ సహకారం.. స్వయం కృషితో వారు ఆర్థిక బలోపేతం దిశగా పయనిస్తున్నారు. అధునాతన హంగులతో మహిళాశక్తి క్యాంటీన్లు నిర్వహిస్తూ.. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.

– జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్)/ గద్వాలన్యూటౌన్/మదనాపురం



కలెక్టరేట్ మహిళాశక్తి క్యాంటీన్‌లో నిర్వాహకురాలు మైబమ్మ, రాధమ్మ

మహబూబ్‌నగర్ కలెక్టరేట్ డైనింగ్ హాల్‌లో హన్వాడ మండలం యారోనిపల్లి గ్రామైక్య సంఘం సభ్యులు మహిళాశక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయగా.. రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. క్యాంటీన్ నిర్వహణకు కలెక్టర్ విజయేందిర పూర్తి సహకారం అందించారు. యారోనిపల్లి గ్రామైక్య సంఘం కార్యదర్శి మైబమ్మ, కోశాధికారి రాధమ్మ, సభ్యులు రాధ, భారతమ్మ, మంగమ్మ, పుష్పమ్మలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. రోజు రూ. 20వేల వరకు వస్తుండగా.. రూ. 15వేల నుంచి రూ.16 వేల వరకు ఖర్చులు పోను రూ. 4వేల నుంచి రూ. 5వేల వరకు సంపాదిస్తున్నారు. క్యాంటిన్‌తో తాము ఆర్థికంగా నిలదొక్కుకుంటూనే.. మరో 10 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.



కుటీర పరిశ్రమతో ఆదాయం..

వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రానికి చెందిన మహిళా సంఘం సభ్యురాలు లక్ష్మమ్మ రెండేళ్ల క్రితం పీఎం మైక్రో ఫుడ్ ఎంటర్‌ప్రైజెస్ పథకం కింద రూ. 6.50లక్షల బ్యాంక్ రుణం పొందారు. చిన్నారులు ఇష్టంగా తినే మురుకులు, బొంది, సొంగలుతో పాటు 15 రకాల తినుబండారాలను తయారుచేసే మిషన్ ఏర్పాటు చేసుకున్నారు. రోజు ఇంట్లోనే తన కోడలు, భర్త, కుమారుడితో కలిసి రూ. 15వేల వరకు వ్యాపారం చేసుకుంటున్నారు.

పాలకోవ తయారీతో స్వయం ఉపాధి..

జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలంలోని బోంకూరు గ్రామానికి చెందిన ఖాసీంబీ స్వయం ఉపాధిలో రాణిస్తున్నారు. 20 ఏళ్ల క్రితం ఖాసీంబీ ఆదర్శ మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరింది. ఆమె భర్త రసూల్ అప్పటికే చిన్నపాటిగా పాలకోవ వ్యాపారం చేసేవాడు. ఖాసీంబీకి బ్యాంకు ద్వారా అందిన రుణంతో పాలకోవ వ్యాపారంలో పాలుపంచుకుంది. పాలకోవకు కావాల్సిన పాలు, చక్కెర తదితర ముడిపదార్థాలతో నాణ్యమైన పాలకోవను తయారు చేసి ఇంటి వద్దే విక్రయించడం ప్రారంభించింది. రుచికరంగా, నాణ్యమైనదిగా ఉండటంతో రోజురోజుకు అమ్మకం పెరిగింది. ఇంటి వద్దే కాకుండా భర్త సహకారంతో కర్నూల్ కలెక్టరేట్‌లోనూ పాలకోవ విక్రయిస్తున్నారు. రోజు 50 కిలోల పాలకోవను తయారుచేస్తూ.. ఖర్చులు పోను రూ. 7వేల నుంచి రూ. 8వేల వరకు సంపాదిస్తున్నారు.



పాలకోవ ప్యాకింగ్ చేస్తున్న ఖాసీంబీ

ఆరుగురు పోలీస్ అధికారులకు సేవా పతకాలు

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పతకాలను జిల్లా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు ఆదివారం జిల్లాకేంద్రంలోని పరేడ్ మైదానంలో జరిగే గణతంత్ర వేడుకల్లో అందజేయనున్నారు. అతి ఉతికృష్ట సేవా పతకాలు ఏఆర్ ఏఎస్పీ సురేష్‌కుమార్, ఏఆర్ ఎస్‌ఐ చిన్న మద్దిలేటి, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ వెంకటయ్య, అలాగే ఉతికృష్ట సేవా పతకాలను కానిస్టేబుల్ జె.వెంకటయ్య, ఉమెన్ ఎస్‌ఐ శైలజ, ఉమెన్ ఎస్‌ఐ అరుణ అందుకోనున్నారు.

మదినిండా మువ్వన్నెల జెండా

- 76 ఏళ్లుగా క్రమం తప్పకుండా జాతీయ పతాకావిష్కరణ
- దేశభక్తి చాటుతున్న స్వాతంత్ర్య సమరయోధుడు ఆర్య నర్సప్ప కుటుంబం



ఆర్య నర్సప్ప (ఫైల్)

మక్తల్: పట్టణంలోని వినాయక నగర్‌కు చెందిన ఆర్య నర్సప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. జాతీయ పండగ వచ్చిందంటే చాలు అతడి ఇల్లు మువ్వన్నెల జెండాలతో వేడుకలకు ముస్తాబవుతోంది. కుటుంబ సభ్యులంతా పొద్దున్నే లేచి.. వాకిట్లో కల్లాపి చల్లి జాతీయ పతాకం ఎగురవేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తారు. పిల్లలు జాతీయ గీతాలపన చేస్తుంటే.. పెద్దలు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అందరికీ స్వీట్లు పంచి పెడతారు. స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకలను 76 ఏళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నారు. 2000 ఏప్రిల్ 28న ఆర్య నర్సప్ప మృతిచెందారు. అయితే అతడు చరమాంక దశలో ఉన్నప్పుడు జెండా పండగను ఎట్టి పరిస్థితుల్లో మరవరాదని.. ప్రతి స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం రోజున తప్పనిసరిగా జాతీయ పతాకం ఎగురవేయాలని కుటుంబ సభ్యులతో మాట తీసుకున్నారు. ఈ మేరకు కుటుంబ సభ్యులందరూ ఆర్య నర్సప్ప అడుగుజాడల్లో నడుస్తున్నారు.



మక్తల్‌లో ఇంటి ఎదుట జాతీయ జెండా ఎగరవేస్తున్న స్వాతంత్ర్య సమరయోధుడు ఆర్య నర్సప్ప కుటుంబ సభ్యులు (ఫైల్)

మేము ఉన్నంత వరకు వేడుకలు నిర్వహిస్తాం..

స్వాతంత్ర్య పోరాటంలో మా నాన్న జైలుకు పోయ్యాడు. జైల్లోనే చనిపోతాడుకున్న ఆయన బతికి వచ్చాడు. రజాకర్ల దుర్మార్గాలను మాకు చెబుతుండే వారు. మా నాన్నకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి ఏడాది రెండు సార్లు జెండాను ఎగురవేస్తాం అన్ని పండగల కంటే మాకు ఇదే ముఖ్యం. ఆర్థికంగా లేకున్నా.. ఎవరు సహాయం చేయకున్నా మా స్థాయిలో వేడుక నిర్వహిస్తాం.

– నారాయణ, (ఆర్యనర్సప్ప పెద్దకొడుకు), మక్తల్



నేడు కోస్గిలో ముఖ్యమంత్రి పర్యటన

- చంద్రవంచ గ్రామం నుంచి కొత్త పథకాలను ప్రారంభించనున్న సీఎం



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్ తదితరులు

కోస్గి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డుల పథకాలను కోస్గి మండలంలోని చంద్రవంచ గ్రామం వేదికగా ప్రారంభించనున్నారు. సీఎం సొంత నియోజకవర్గం నుంచి నాలుగు కొత్త పథకాలను ప్రారంభించనున్న నేపథ్యంలో అధికారులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఎస్పీ లింగయ్యతో పాటు ఇతర అధికారులు ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. చంద్రవంచ గ్రామ శివారులో ఉన్న డాగ్‌బంగ్లా సమీపంలో హెలిప్యాడ్‌తోపాటు బహిరంగ సభ కోసం స్థలాన్ని ఎంపిక చేశారు. సీఎం పర్యటన శనివారం ఆకస్మాత్తుగా ఖరారు కావడంతో అధికారులు హుటాహుటీన గ్రామానికి చేరుకొని హెలిప్యాడ్ ఏర్పాటు చేయించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బలగాలతో బందోబస్తు నిర్వహించారు. కలెక్టర్ తోపాటు కడా చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ రాంచందర్ నాయక్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.



భారీ పోలీస్ భద్రత

మహబూబ్‌నగర్ క్రైం: చంద్రవంచ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి 261 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తుకు కేటాయించారు. ముగ్గురు అదనపు ఎస్పీలు, ఆరుగురు డీఎస్పీలు, 13 మంది సీఐలు, 26 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, 30 మంది హెడ్ కానిస్టేబుల్స్, 120 మంది కానిస్టేబుల్స్, 28 మంది మహిళ హోంగార్డులు, 35 మంది హోంగార్డులకు బందోబస్తు విధులు కేటాయించారు. వీరితో పాటు అదనంగా నాలుగు ఏఎస్‌సీ బృందాలు, రోప్ బృందాలు మూడు, యాక్సెస్ కంట్రోల్ బృందాలు 11, రోప్ పార్టీ బృందాలు రెండు కేటాయించారు. వీరితో పాటు నారాయణపేట జిల్లా స్థానిక పోలీస్ సిబ్బందితో పాటు వికారాబాద్, రంగారెడ్డి నుంచి కొంత పోలీస్ బలగాలను సీఎం కార్యక్రమం దగ్గర విధులు కేటాయించనున్నారు.

న్యూస్‌రీల్

చోరీల కట్టడికి పటిష్ట నిఘా

మహబూబ్‌నగర్ క్రైం: కేసుల విచారణలో పూర్తిగా పారదర్శకతతో నేరస్థులకు శిక్షపడేలా పనిచేయాలని, కన్విక్షన్ శాతం పెంచడంతో పాటు చోరీల నియంత్రణకు పటిష్ట నిఘా పెట్టాలని ఎస్పీ జానకి అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ వారిగా యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. విచారణలో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని, ప్రధానంగా పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారించి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి సీడీ ఫైల్‌ను దాంట్లో డాక్యుమెంట్స్‌ను పరిశీలించికోర్టుకు సమర్పించాలని, పెండింగ్‌లో ఉన్న సీసీ నంబర్లు తీసుకోవాలన్నారు. చోరీ కేసుల్లో ప్రివెంట్ యాక్షన్ తీసుకోవాలని, పాత నేరస్థులపై నిఘా ఉంచాలని సూచించారు. చోరీ కేసుల్లో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దొంగలను పట్టుకోవాలని, కోల్పోయిన సొమ్ము రికవరీ శాతం పెంచాలన్నారు. నేరాల కట్టడికి విసిబుల్ పోలీసింగ్, నిరంతరం పెట్రోలింగ్‌తోపాటు సాంకేతిక వ్యవస్థ కూడా ఉపయోగించుకోవాలన్నారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ఉపయోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి, పేకాట, పీడీఎస్ రైస్, గుడుంబా, వైట్ కాలర్, ఇతర చట్ట వ్యతిరేకమైన నేరాలను, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. నిత్యం గస్తీ తిరగడం, డయల్ 100 కాల్‌కు వెంటనే స్పందించాలన్నారు. అనంతరం కోర్టులో నేరస్థులకు శిక్ష పడటానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, కానిస్టేబుళ్లకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, డీఎస్పీలు వెంకటేశ్వర్లు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కాంతుల్లో కలెక్టరేట్



గణతంత్ర వేడుకలకు ముస్తాబు

- పరేడ్ మైదానంలో జెండా ఎగురవేయనున్న కలెక్టర్
- కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాలకు విద్యుద్దీపాల అలంకరణ

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో 76వ గణతంత్ర వేడుకలకు అధికార యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. శనివారం రాత్రి కలెక్టరేట్, జెడ్పీతోపాటు ఎస్పీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లు అంబేద్కర్ సర్కిల్, తెలంగాణ చౌరస్తా, క్లాక్‌టవర్‌లను విద్యుద్దీపాలతో అలంకరించారు. గణతంత్ర వేడుకల రిహార్సల్స్‌ను శనివారం పరేడ్ మైదానంలో జిల్లా పోలీస్ అధికారులు కవాత్తు సాధన చేశారు. ఎస్పీ కార్యాలయంలో పరేడ్‌తోపాటు వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన స్టాళ్లు, వేడుకలు వీక్షించడానికి అతిథులకు కావాల్సిన స్టేజీలను ఏర్పాట్లు చేశారు. పరేడ్ మైదానంలో కలెక్టర్ విజయేందిర, ఎస్పీ జానకి పాల్గొని జెండావిష్కరణ చేస్తారు.

విస్తృతంగా తనిఖీలు

గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లాకేంద్రంతోపాటు పలు ముఖ్య పట్టణాల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా అనుమానం కలిగిన వారి నుంచి వివరాలు సేకరించారు. ముఖ్యంగా పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల దగ్గర ఉన్న బ్యాగులు, స్టేషన్ పరిసర ప్రాంతాలు, బస్టాండ్‌లో ప్రయాణికులు, వారి వస్తువులు, బ్యాగులతో బస్సు లోపల, బస్టాండ్ పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రధాన చౌరస్తాలలో పోలీసులు కార్లు, లారీలు, బస్సులు ఇతర వాహనాలు ఆపి తనిఖీలు చేశారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ చౌరస్తా తోపాటు ప్రధాన దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

కార్యక్రమాలు ఇలా..

- ఉదయం 8.50 గంటలకు మైదానంలో గణతంత్ర వేడుకలు ప్రారంభమవుతాయి.
- 8.59 గంటలకు పరేడ్ మైదానానికి కలెక్టర్ చేరుకుంటారు.
- 9 గంటలకు కలెక్టర్ జాతీయ జెండా ఆవిష్కరణ, వందన స్వీకారం ఉంటుంది.
- 9.02 నుంచి 9.15 వరకు సంప్రదాయ పోలీస్ కవాతు నిర్వహిస్తారు.
- 9.16కు కలెక్టర్ ప్రసంగిస్తారు.
- 9.26 స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు.
- 9.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.
- 10.11 గంటల నుంచి స్టాళ్ల సందర్శన
- 11 గంటలకు కార్యక్రమం ముగుస్తుంది.



జిల్లాకేంద్రంలో తనిఖీలు చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలో 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటుహక్కును కలిగిన ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు అని, అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని, ఓటు ద్వారానే ప్రజాస్వామ్యంలో మార్పు వస్తుందని, మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకునే అవకాశం ఉందని, తద్వారా ప్రజాస్వామ్యం పటిష్టమవుతుందన్నారు. జిల్లాలో 7.27 లక్షల మంది ఓటర్లు ఉన్నారని, ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అన్నారు. ఓటరు నమోదుకు స్కూల్, కాలేజీలో స్వీప్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలన్నారు. గ్రామీణ ప్రజలు, పేదలు పెద్దఎత్తున ఎన్నికల ప్రక్రియలో పాల్గొంటుండగా.. చదువుకున్న వారు ఓటు వేసేందుకు ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. చదువుకున్న వారు, ఉద్యోగులు, వృత్తులలో ఉన్నవారు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అలాగే ఓటుహక్కు వినియోగంపై ఉద్యోగులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటుహక్కు ప్రాముఖ్యతపై నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. సీనియర్ సిటిజన్ ఓటర్లను సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, డీఆర్‌డీఓ నర్సింహులు, డీపీఓ పార్థసారధి, డీఎంహెచ్‌ఓ కృష్ణ, మైనారిటీ శాఖ అధికారి శంకరాచారి, ఏఓ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ విజయేందిర

అవగాహన ర్యాలీ..

ఓటుహక్కు ప్రాధాన్యతపై జిల్లాకేంద్రంలోని స్టేడియం గ్రౌండ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా మీదుగా తిరిగి స్టేడియం గ్రౌండ్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని అదనపు కలెక్టర్ మోహన్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో అధికారులు, విద్యార్థులు పాల్గొని ప్ల కార్డులు చేతబట్టి మన ఓటు– మన హక్కు, ఓటు ఈజ్ యువర్ వాయిస్ వంటి నినాదాలు చేశారు. ర్యాలీలో ఆర్డీఓ నవీన్, అర్బన్ తహసీల్దార్ ఘన్సీ రాంనాయక్, డీటీలు దేవేందర్, సునీల్, ఆర్‌ఐలు నర్సింగ్, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

మన్యంకొండలో పెళ్లిళ్ల నిలిపివేత

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీఅలివేలు మంగతాయారు దేవస్థానం నిత్య కల్యాణం.. పచ్చతోరణంగా భాసిల్లుతుంది. కొలిచిన వారికి కొంగు బంగారమై విరాజిల్లుతున్నది ఈ పుణ్యక్షేత్రం. అయితే ఫిబ్రవరి 7 నుంచి 26వ తేదీ వరకు శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, మార్చి 11 నుంచి 17 వరకు అలివేలు మంగతాయారు అమ్మవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మన్యంకొండలో పెళ్లిళ్లను నిలిపివేస్తున్నామని దేవస్థాన చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

దేశ రక్షణలో మేము సైతం..



- సైన్యంలో ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల నుంచి భారీగా చేరిన యువత
- 1975 నుంచి నేటి అగ్నిపథ్ వరకు..

నాగర్‌కర్నూల్ రూరల్/వెల్దండ/వనపర్తి రూరల్:

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల నుంచి భారీగా యువత సైన్యంలో చేరి సేవలందిస్తున్నారు. ఇందులో నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూరు నుంచి వివిధ భద్రతా విభాగాల్లో 60 మంది వరకు చేరగా 80 శాతం మంది ఆర్మీలోనే ఉన్నారు. 2019లో కశ్మీర్ సరిహద్దులో జరిగిన సర్జికల్ స్ట్రైక్‌లో 500 మంది మిలిటెంట్లను హతమార్చిన సైన్యంలో గ్రామానికి చెందిన కిషోర్‌గౌడ్ కూడా ఉన్నారు. వెల్దండలో 40మంది ఆర్మీలో చేరారు. అలాగే వెల్దండకు చెందిన 40 మంది యువత ఆర్మీలో, సీఆర్పీఎఫ్, సీఐఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ తదితర బలగాల్లో 15 మంది చేరారు. వనపర్తి జిల్లా సవాయిగూడెం నుంచి 25 మంది యువకులు 16 ఏళ్లుగా భారత సైన్యంలో చేరి దేశసేవకు అంకితమయ్యారు.

మరువలేని అనుభూతి..



గ్రామంలో చాలామంది సైన్యంలో చేరుతుండటం చూసి ఆసక్తి పెంచుకున్నా. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా లభించడంతో చేరాను. జమ్మూకశ్మీర్, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో విధులు నిర్వహించా. 2019లో కశ్మీర్ సరిహద్దులో జరిగిన సర్జికల్ స్ట్రైక్‌లో పాల్గొని 500 మంది మిలిటెంట్లను హతమార్చిన ఆపరేషన్‌లో పాల్గొన్నా. ఆ ఘటన జీవితంలో ఎన్నటికీ మరువలేనిది.

– కిషోర్‌గౌడ్, విశ్రాంత ఆర్మీ జవాన్, పెద్దముద్దునూరు, నాగర్‌కర్నూల్

2013 నుంచి సేవ..



గ్రామం నుంచి సైన్యంలో చాలామంది యువకులు చేరారు. నేను కూడా చేరాలని నిశ్చయించుకొని 2013లో చేరా. దేశ సరిహద్దుల్లో విధులు నిర్వర్తించి ప్రస్తుతం హైదరాబాద్‌లో పని చేస్తున్నా. 11 ఏళ్లుగా దేశ భద్రతలో ఉండటం సంతోషాన్నిచ్చింది.

– చిన్నయ్య, ఆర్మీ జవాన్, పెద్దముద్దనూరు, నాగర్‌కర్నూల్

చైనా సరిహద్దులో పని చేస్తున్నా..



దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో ఆర్మీలో చేరా. నాతో పాటు గ్రామం నుంచి 40 మందికిపైగానే సైన్యంలో చేరారు. ప్రస్తుతం చైనా సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్నా. ప్రతి పౌరుడు దేశ రక్షణకు పాటుపడాలి.

– భీమయ్య, వెల్దండ

ఆదర్శప్రాయుడు.. నర్సింహులు



లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన మాజీ సైనికుడు కంప నర్సింహులు వృద్ధాప్యంలోనూ దేశభక్తి చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 1957లో మద్రాస్ రెజిమెంట్ సైన్యంలో తన ప్రస్థానాన్ని ప్రారంభించి సుమారు 20 ఏళ్ల పాటు పని చేశారు. 1962లో చైనా వార్‌లో, 1965లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ యుద్ధంలో పాల్గొన్నారు. సైన్యంలోనే పలు అవార్డులు సైతం సొంతం చేసుకున్నారు. ఇప్పటికీ కూడా స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకల్లో యూనిఫాం ధరించి పాల్గొని జాతీయ జెండాకు వందనం చేస్తూ అందరిని ఆకర్షిస్తున్నారు. దేశానికి ఆయన చేసిన సేవను పలువురు గుర్తు చేసుకుంటున్నారు.



యూనిఫాంతో గర్వంగా ఉంది..

నేను దేశానికి సేవ చేస్తున్నా. యూనిఫాం ధరించడం ఎంతో గర్వంగా ఉంది. కుటుంబ సభ్యులు, గ్రామం గుర్తుకొచ్చిన సమయంలో దేశ బాధ్యతను గుర్తు చేసుకొని గర్వంగా ఫీలవుతుంటాను.

– దేగ పవన్‌కుమార్‌రెడ్డి, సవాయిగుడెం, వనపర్తి

యువతను ప్రోత్సహిస్తూ..



దేశసేవలో భాగస్వాములు కావాలంటూ యువతను ప్రోత్సహిస్తున్నాను. నేను కూడా 15 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నా. ప్రస్తుతం జమ్ము కశ్మీర్‌లో పనిచేస్తున్నా.

– ఎండీ సద్దాం, వెల్దండ

పీయూలో ముగిసిన న్యాక్ కమిటీ పర్యటన



వీసీ శ్రీనివాస్‌కు నివేదిక ఇస్తున్న న్యాక్ కమిటీ చైర్మన్ రామశంకర్ దుబే

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ న్యాక్ కమిటీ మూడు రోజుల పర్యటన శనివారం సాయంత్రం ముగిసింది. చివరిరోజు బాలికల రెండు హాస్టళ్లు, బాలుర రెండు హాస్టళ్లు, ఫార్మసీ కళాశాల, పలు పీజీ సెంటర్లను పరిశీలించారు. సాయంత్రం పీయూ లైబ్రరీ ఆడిటోరియంలో కమిటీ సభ్యులకు యూనివర్సిటీ అధికారులు ఎగ్జిట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ రామ శంకర్ దుబే మాట్లాడుతూ యూనివర్సిటీలో మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, విద్యార్థులకు సరిపడా మౌళిక వసతులు మెరుగ్గా ఉన్నాయన్నారు. టీచింగ్, నాన్‌టీచింగ్, అల్యూమిన్ విద్యార్థులతో జరిపిన ముఖాముఖిలో సంతృప్తికర సమాధానాలు వచ్చాయన్నారు. మూడు రోజులపాటు కమిటీ సభ్యులకు ఇచ్చిన ఆతిథ్యం బాగుందని, ముఖ్యంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. అలాగే మూడు రోజుల పర్యటనలో పీయూలో చేయాల్సిన మార్పులు, వసతులు తదితర అంశాలపై పూర్తిస్థాయిలో నివేదిక రూపొందించి వీసీ, రిజిస్ట్రార్‌లకు అందించామని, మరో పది రోజుల్లో గ్రేడింగ్ ఫలితాలు వస్తాయని చెప్పారు. వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాక్ కమిటీ సమర్పించిన రిపోర్టులోని అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని తప్పకుండా అమలు చేసేందుకు కృషిచేస్తామన్నారు. అలాగే పీయూకు మెరుగైన గ్రేడింగ్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, కమిటీ సభ్యులు అశుతోష్ కుమార్, అన్నస్వామి నారాయణమూర్తి, కేకే అగర్వాల్, మల్లె దాసు, జయశ్రీ, ఐక్యూఏసీ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

HAPPY REPUBLIC DAY
Dear Parents & Well Wisher's Wish You "Happy Republic Day"
PALLAVI The School NURSERY TO VII CLASS
Address: Deshaipally (Vill), Mohammadabad (mdl), Mahabubnagar Dist.
Please Contact: 8978415427, 9948644337
Run By under (New Management)
MAA AAKRUTHI SCHOOL'S
Nursery to X Class E/M
A Fresh thought A New Approach
We Provide the best Education

HAPPY REPUBLIC DAY
Dear Parents & Well Wisher's Wish You "Happy Republic Day"
CHAITANYA VIDHYANIKETHAN SCHOOL
R.C A5/1591/2024
NURSERY TO VII CLASS ENGLISH MEDIUM
Address: Nancherla (Vill), Mohammadabad (mdl), Mahabubnagar Dist. Contact: 9704789007

HAPPY REPUBLIC DAY
Divine Grace High School Wishes You
LEAD
HAPPY REPUBLIC DAY
Get 5 Times Better Learning
In a Lead Powered School
Class: Nursery-X, English Medium
DIVINE GRACE HIGH SCHOOL
Joy - Care - Knowledge
Opp : Geetha Hotel, Kamala Nehru Colony, Mahabubnagar.
Contact : 9505784187, 9390182326

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో బాలిక దుర్మరణం



లోహితాప్రిహాన్సీ

వీపనగండ్ల: రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ కె.రాణి వివరాల ప్రకారం.. పుల్గర్‌చర్ల గ్రామానికి చెందిన గంగాధర్, లక్ష్మీప్రసన్న కూతురు లోహితాప్రిహాన్సీ(2) బస్టాండ్ సమీపంలో ఆడుకుంటుండగా.. కల్వరాల గ్రామానికి చెందిన రాములు బొలేరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో బాలికకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఉన్న ఒక్కగానొక్క కూతురు మృతిచెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుడిసెకు నిప్పంటుకొని వృద్ధురాలి మృతి

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గద్వాల మండలం కొండపల్లి గ్రామానికి చెందిన కుర్వ లక్ష్మీదేవమ్మ(70) పూరి గుడిసెల్లో నివసిస్తుంది. రాత్రి చల్లి తీవ్రత పెరగడంతో వెచ్చదనం కోసం ఇంట్లోని కట్టెల పోయ్యిని వెలిగించి నిద్రలోకి జారుకుంది. ఈక్రమంలో నిప్పు రవ్వలు ఎగిరిపడటంతో గుడిసెకు నిప్పంటుకొని మంటలు వ్యాపించాయి. ఆమె మంటల్లో చిక్కుకోగా స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. మంటలు అదుపులోకి వచ్చాక అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించా రు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న జెడ్పీ మాజీ చైర్ పర్సన్ సరిత బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మదనాపురం: డంపింగ్ యార్డు వద్ద చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మొహమ్మద్ షబ్బీర్ (53) తండ్రి రసూల్ వృత్తి వంట మాస్టర్ తన కుటుంబంతో 15 ఏళ్ల క్రితం స్వగ్రామం చిన్నచింతకుంట మండలంలోని అల్లీపూర్ నుంచి కొత్తకోటకు వచ్చి స్థిరపడ్డాడు. మద్యానికి బానిసైన షబ్బీర్ తరచుగా మద్యం తాగొచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈనెల 16న భార్యతో గొడవపడి బయటికి వెళ్తున్నానని చెప్పిపోయాడు. తర్వాత చుట్టుపక్కల, బంధువులతో వెతికినా కనిపించలేదు. మదనాపురం డంపింగ్ యార్డ్ సమీపంలో చెట్టుకు అడ్డపంచతో ఉరేసుకున్న షబ్బీర్ మృతదేహాన్ని గుర్తించారు. కుల్లిన మృతదేహం చూసి రెండు రోజుల క్రితం ఉరేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. షబ్బీర్‌కు ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓవరాల్ చాంపియన్లు వనపర్తి, మహబూబ్‌నగర్



బాలికల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

- ముగిసిన ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడాపోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. ఈ క్రీడాపోటీల్లో బాలుర విభాగంలో వనపర్తి కేడీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. వ్యక్తిగత విభాగం బాలురలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థి వై.మురళీకృష్ణ, బాలికల విభాగంలో ఎం.నిఖిత చాంపియన్‌షిప్‌లు గెలుచుకున్నారు.

అథ్లెటిక్స్ ఫలితాలు..

బాలుర విభాగం 4X100, 4X400 మీటర్ల రిలే పరుగులో మహబూబ్‌నగర్ కళాశాల ప్రథమ, వడ్డేపల్లి కళాశాల ద్వితీయ, బాలికల రిలే పరుగులో పెబ్బేర్ కళాశాల ప్రథమ, మహబూబ్‌నగర్ కళాశాల ద్వితీయ స్థానాలను దక్కించుకున్నాయి. బాలుర విభాగం 100మీటర్ల పరుగులో ఎం.వినీత్–పథమ), శివశంకర్–ద్వితీయ(మహబూబ్‌నగర్), 200మీలో ఎం.వినీత్–ప్రథమ (మహబూబ్‌నగర్), తేజ–ద్వితీయ(కోస్గి), 400మీలో రజినికాంత్–ప్రథమ, వై.మురళీకృష్ణ–ద్వితీయ(మహబూబ్‌నగర్), 800మీలో కె.విఘ్నేశ్వర్–ప్రథమ, శివకుమార్–ద్వితీయ, 1500మీలో శివకుమార్–ప్రథమ(మహబూబ్‌నగర్), తేజ–ద్వితీయ(కోస్గి) స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగం 100మీటర్ల పరుగులో మైత్రి–ప్రథమ(పెబ్బేర్), స్నేహ–ద్వితీయ(మహబూబ్‌నగర్), 200మీలో భవాని–ప్రథమ(జేపీఎన్‌సీఈ), మైత్రి–ద్వితీయ (పెబ్బేర్), 400మీలో నందిని–ప్రథమ(పెబ్బేర్), పల్లవి–ద్వితీయ (మహబూబ్‌నగర్), 800మీలో ప్రశాంతి–ప్రథమ, చందన ద్వితీయ (మహబూబ్‌నగర్), 1500మీలో నిఖిత–ప్రథమ(మహబూబ్‌నగర్), అనూష–ద్వితీయ (కోస్గి) స్థానాల్లో నిలిచారు. గెలుపొందిన విన్నర్, రన్నరప్ జట్లకు ప్రిన్సిపాల్ మోహన్ బాబు ట్రోఫీలు అందజేసి అభినందించారు. చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభచాటాలని కోరారు. ఇన్‌చార్జి పీడీ శ్రీకాంత్, హెచ్‌ఓడీలు అప్పారావు, కె.వీరస్వామి, రాజేశ్వరి, సత్యనారాయణ, ప్రవీణ, జువేరియా జరీన్ పాల్గొన్నారు.

వైభవంగా అంజన్న జాతర ప్రారంభం



బండ్ల ఊరేగింపును ప్రారంభిస్తున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

ఊర్కొండ: మండలంలోని ఊరుకొండపేట గ్రామంలో వెలసిన పబ్బతి ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఊరుకొండపేటలో అర్చకుల ఇంటి నుంచి స్వామివారి మూలవిరాట్‌ను పల్లకీలో గ్రామ వీధుల వెంబడి ఊరేగింపు చేసి ఆలయానికి చేరుకొని స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుల ఆధ్వర్యంలో ధ్వజారోహనం చేశారు. అనంతరం ఆలయ చైర్మన్ సత్యనారాయణరెడ్డి జెండా ఊపి బండ్ల ఊరేగింపు ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులు తమ వాహనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వెంకటయ్య గౌడ్, రమేష్నాయక్, తిరుపతిరెడ్డి, అబ్దుల్ సమీ, వహీనుద్దీన్, మనోహరెడ్డి, ఆదినారాయణ, శ్యాంసుందర్‌రెడ్డి, నర్సిరెడ్డి, గోపాల్, ఆలయ అధికారులు మారుతిరావు, అర్చకులు దత్తాత్రేయశర్మ, శ్రీను శర్మ, ప్రవీణ్ శర్మ, మహేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గణిత నమూనా కీలక పాత్ర



గణితశాస్త్రం అనువర్తనాలను వివరిస్తున్న ప్రొ.డా.కే.రమేష్‌బాబు

బిజినేపల్లి: ఇంజినీరింగ్, జీవశాస్త్రం, ఆర్థికశాస్త్రం పర్యావరణ శాస్త్రం వంటి విభిన్న శాస్త్రాల్లో వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడంలో గణిత నమూనా తయారీ కీలకపాత్ర పోషిస్తుందని ఉస్మానియా ఇంజినీరింగ్ కళాశాల ప్రో.డా.కే.రమేష్ బాబు అన్నారు. శనివారం మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్రంలో జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రొ.డా.కే.రమేష్‌బాబు మాట్లాడుతూ గణిత నమూనా తయారీ ప్రాథమికాలను అర్థం చేసుకోవడానికి, గణిత నమూనా తయారీలో వినూత్న విధానాలను అన్వేషించడానికి, వివిధ విభాగాలలో గణిత నమూనా తయారీ అనువర్తనాలను వివరించారు. పాలెం శ్రీవేంకటేశ్వర కళాశాల ప్రిన్సిపల్ డా.పి.రాములు మాట్లాడుతూ గణితం మానవులతో పరిశోధన, విశ్లేషణ మొక్క విత్తనాన్ని నాటుతుందన్నారు. గణిత పరిశోధన సమాజానికి అధ్యయనాలు, పురోగతిలో కూడా సహాయ పడుతుందన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ వైస్ ప్రిన్సిపల్ డా. పద్మజ, లైబ్రేరియన్ డా.వర్కాల శ్రీనివాసులు, అధ్యాపకులు నాగరాజు, డా.సుష్మ, శివ, డా.రాధాకుమారి, డా.స్వప్న, నాగలింగం, మనోజ్ కుమార్, వెంకటేష్, రవికుమార్ పాల్గొన్నారు.

ఇసుక తరలించొద్దని ఆందోళన

- దుందుభీ వాగు వద్ద రైతుల వంటావార్పుతో నిరసన



వంటావార్పుతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

తెలకపల్లి: మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలో దుందుభీ వాగు నుంచి ఇసుక తరలింపుపై ఆందోళన చేస్తూ గ్రామ రైతులు నది వద్ద టెంట్ వెసుకొని వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, రైతులు మాట్లాడుతూ అనుమతి పేరుతో దుందుభీ వాగు నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఇసుకను తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో 150 వ్యవసాయ బోర్లు ఉన్నాయని మెట్ట, తరి పొలాలలో 10వేల ఎకరాల మేర పంటలు పండించుకుంటున్నామన్నారు. దుందుభీ వాగు నుంచి అనుమతుల పేరా ఇసుకను తరలిస్తే బోర్లు ఎండిపోయి పంటలు పండక తీవ్ర ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకను తరలించొద్దని సంబంధిత అధికారులకు, కలెక్టరు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ ప్రాతం నుంచి నాగర్‌కర్నూల్ ఏరియాకు ఇసుకను తరలిస్తున్నారని, వెంటనే ఇసుక రవాణా ఆపాలని డిమాండ్ చేశారు. మురళీధర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, రైతులు ఆంజనేయులుగౌడ్, యాకోబు, ఎక్బల్, అయూబ్, జగత్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

టీడీసీఏ అంతర్‌జిల్లా టోర్నీకి ఉమ్మడి జిల్లా జట్టు



టీడీసీఏ ఉమ్మడి జిల్లా జట్టుతో నవీన్‌కుమార్

మహబూబ్‌నగర్ క్రీడలు: తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (రూరల్) ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 31 వరకు టీడీసీఏ అంతర్‌జిల్లా అండర్–17 టీ–20 నాకౌట్ టోర్నమెంట్ హైదరాబాద్‌లోని దోమల్‌గూడలోని ప్రభుత్వ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల మైదానంలో ఉంటుందని టీడీసీఏ కన్వీనర్ నవీన్‌కుమార్ తెలిపారు. ఈ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికను జిల్లా కేంద్రం క్రిస్టియన్‌పల్లిలోని బద్రర్ హుడ్ క్రికెట్ అకాడమీలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిభకనబరిచిన వారిని తుది జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. అంతర్ జిల్లా టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచే రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల జట్ల నుంచి చెరో ఆరుగురు క్రీడాకారులను ఎంపికచేసి తెలంగాణ అండర్–17 ఏ–టీమ్‌కు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ టీమ్ మార్చి 22 నుంచి 31 వరకు హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో యూఎస్ఏ క్రికెట్ అకాడమీ జట్టుతో మ్యాచ్‌లు ఆడుతారన్నారు. ఉమ్మడి జిల్లా జట్టు సద్వినియోగం చేసుకొని టీ–20 టోర్నీలో తమ ప్రతిభ చాటుకోవాలని కోరారు. నవాజ్‌సా, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా టీడీసీఏ జట్టు

రవితేజ, దుర్గ (వనపర్తి), శ్రీహర్షిత్, హర్షవర్ధన్, రిత్విక్, సోహైల్ (షాద్‌నగర్), అర్షద్, అఖిల్, సాత్విక్, రాంచరణ్ (అచ్చంపేట), సయిద్ (వడ్డేమాన్), అబ్దుల్ వాసే, సంజయ్, బీరేందర్, కుమార్, దక్షపాటిల్ (మహబూబ్‌నగర్), జట్టు కోచ్‌గా నవాజ్‌షా, మేనేజర్‌గా డి.శ్రీనివాస్‌రెడ్డి.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వచ్చే వేసవిలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ సీఈ నర్సింహస్వామి అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని విద్యుత్ భవన్ ఎస్ఈ చాంబర్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేసేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు జిల్లాలో 33, 11 కేవీ సబ్‌స్టేషన్ల ప్రతిపాదనలు ఉంటే పంపించాలని సూచించారు. విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా అధిక సామర్థ్య పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చడంపై దృష్టి పెట్టాలన్నారు. విద్యుత్ సరఫరాలో ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు జిల్లా, డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేయాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులకు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ వెంకటరమేష్, డీఈ చంద్రమౌళి, నవీన్ తదితరులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
■ ప్రజా రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ కల్వకుర్తి టౌన్‌లో ప్లాట్లు మరియు ఇండ్లు అమ్మదలచిన వారు మరియు కొనదలచిన వారు సంప్రదించండి. సెల్ : 9059211546.

FOR SALE
■ SALE: 175 sq. yd. North East corner Plot in Jadcherla KVMPT. Call - 9948124949.

SERVICES

BUSINESS OFFER
■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిగ్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర: 8376001873, 98430 10487, 8376089771, 011-25820179

HEALTH CARE

ORTHOPEDIC SURGEON
■ డా॥ యస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష హాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, 3వ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 – 228666, 83412 98666.

WANTED
■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడి వార్డెన్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, బార్యాభర్తలు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901
■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీతం: 18K Ph: 9160900024, 9640400073

■ ప్రముఖ మైనింగ్ కంపెనీకి 5-10 సం॥ అనుభవం గల HR / ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్, టిప్పర్ IT డీజిల్ మెకానిక్స్-2, Sr & Jr ఎలక్ట్రీషియన్స్-2 వెంటనే కావలెను. కేశవ్ 99894 88310
■ సెక్యూరిటీగార్డ్స్ HYDలోఅన్నోజిగూడ, ఘట్‌కేసర్, అమంగల్, తుక్కుగూడకు కావలెను. 12గం. డ్యూటీ. జీ॥15,000+ESI, EPF+రూంఫ్రీ. Age: 35-48 Yrs. 1 సం॥ Exp. ధ్రువ సెక్యూరిటీ. 7702365554
■ హైదరాబాద్‌లో ఇంట్లో ఉండి సీనియర్ సిటిజన్‌ను చూసుకుంటు, ఇంటి మరియు వంట పనిలో అనుభవంగల 50 సం॥లోపు వయసుకున్న మగమనిషి కావలెను. 8019188715

సాక్షి ద్వారా మీ ఆప్తుల పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయండి కేవలం రూ. 500/- మాత్రమే
HAPPY BIRTHDAY

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ఆసక్తిగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు – సాక్షి మేనేజర్